కథా నిలయం
శ్రీకాకుళం

# అడ్డదారి

ఉత్తరాలు వచ్చే సమయం. ఉదయం పదకొండు గంటల దాకా ఎప్పుడూ ఉత్సాహంగానే వుంటుంది, కొద్దిగా ఎక్సైటింగ్ గా. అందులో దాదాపు ప్రతిరోజూ ఉత్తరం వచ్చే నాకు ఇంకా ఉత్సాహంగ వుంటుంది, ఎవరినుంచి వస్తుందోనని.

ఆ రోజు ఆఫీస్‌కి కొంచెం ఆలస్యంగా, ఉదయం పదకొండు తర్వాత వెళ్ళాను. నా గాడ్రేజ్ టేబిల్ మీద ఉత్తరాల దొంతర వుంది. పైన పేపర్ వెయిట్‌తో.

కుర్చీలో కూర్చొని అందుకున్నాను వాటిని. మొత్తం నాలుగు. ఒకటి ఓ చిట్ ఫండ్ కంపెనీనుంచి, ఆ నెల నేను ఎంత డబ్బు కట్టాలో తెలియజేసే కార్డ్. ఒకటి ఇంటినుంచి క్షేమసమాచారాలు గురించి అడుగుతూ అమ్మ రాసిన ఉత్తరం. నేను ఇంటికి రాసిన వుత్తరం అందినట్లు లేదనుకున్నాను.

మూడవది నా కన్నడం అనువాదకురాలినుంచి.

మధ్య తెలుగులో ప్రచురితమయిన ఓ నా కథను, కన్న డంలో ఓ వారపత్రికలో ప్రచురించబోతుందని తెలియజేస్తూ ట్రాన్స్లేటర్ రాసిన వుత్తరం.

నాలుగవది ఇన్లాండ్ లెటర్. నా పంజాబీ స్నేహితుడినుంచి, మర్నాడు హైద్రాబాదు వస్తున్నట్లు ఆ మర్నాటికి బెంగుళూరుకు బస్ టిక్కెట్ రిజర్వు చేసి వుంచమని అభ్యర్థన.

నేను ఎదురుచూస్తున్న వుత్తరం, నాగాలాండ్ పెన్ ఫ్రెండ్ నుంచి రాలేదు. ఇంఫాల్ నుంచి రేపు రావచ్చు అనుకున్నాను.

జేబులోంచి చెక్ బుక్ తీసి చిట్ ఫండ్ కంపెనీకి పంపాల్సిన డబ్బుకి చెక్ రాసి, రబ్బర్ స్టాంప్తో చెక్ ని క్రాస్ చేసి, ఉత్తరం రాసి, కవరులో పెట్టి అతికించాను ఇన్లాండ్ లెటర్ కార్డులో ఇంటికి ఉత్తరం రాశాను, క్షేమసమాచారాలు తెలిపే రొటీన్ ఉత్తరం.

తర్వాత బస్ డిపో ఎంక్వయిరీకి ఫోన్ చేసి, బెంగుళూరుకి రిజర్వేషన్ పరిస్థితి కనుక్కొన్నాను. పదిసీట్లు దాకా ఖాళీవున్నాయి. సాయంత్రం వచ్చి రిజర్వేషన్ చేస్తానని, ఒకటిమాత్రం వుంచమని చెప్పి ఫోన్ పెట్టేశాను.

కన్నడం ట్రాన్స్లేటర్ కి సమాధానం రాస్తుంటే, తలుపు తోసుకుని చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ వచ్చారు గదిలోకి. అలవాటు ప్రకారం లేచి నిలబడ్డాను నమ్రతగా.

సాధారణంగా ఆయన నా గదికి రారు. అసలు ఏ ఎకౌంట్స్ ఆఫీసర్స్ గదికి వెళ్ళరు ఎప్పుడోగాని, ఏదయినా ముఖ్యమయిన పని వుంటే తప్ప.

"బిజీగా ఉన్నారా?" అడిగారు నవ్వుతూ.

"లేదు ఇంకా. ఏవో ఉత్తరాలు."

"లెటర్సా! పర్సనల్ వా?" అడిగారు.

"అవును" చెప్పాను.

"అదృష్టవంతుడివి. ఎంతటాప్ ఎగ్జిక్యూటివ్ అయినా, ముందర స్వంత ఉత్తరాలు చదవందే ఆఫీస్ కాగితాలు చూడడు."

నవ్వాను.

"ఆడిటర్స్ నుంచి ఉత్తరం వచ్చింది. రేపు వస్తున్నారు స్టాట్యూటరీ ఆడిట్ కి. అన్నీ సిద్ధంగా వుంచాలి."

"అలాగే సార్" చెప్పాను.

"తర్వాత," కొంచెంసేపు ఆగి, గుర్తు తెచ్చుకుని చెప్పారు. "మీ సెక్షన్ కు సంబంధించిన క్లోజింగ్ ఎంట్రీస్ ఇవాళ పూర్తయిపోవాలి."

తల వూపాను.

కుర్చీలో కూర్చుని, ట్రేలో ఎదురుచూస్తున్న కాగితాలని ముందుకి లాక్కుని, రొటీన్ లో పడిపోయాను.

సాయంత్రం ఆఫీస్ నుంచి తిన్నగా గదికి వెళ్ళిపోయాను. మొహం కడుక్కొని, పక్కరూము ఫ్లాస్క్‌లో తెచ్చివుంచిన కాఫీ తాగి బస్ డిపో వైపు వెళ్దామనుకున్నాను. బయటకి వస్తూంటే, టేబిల్ మీద పూర్తి చేయబడివున్న కాగితాల దొంతర కనబడ్డది.

గుర్తుకు వచ్చింది నాకు. క్రితంరాత్రి కూర్చుని పూర్తి చేసిన కథ అవి. వాటిని అందుకుని, సిద్ధంచేసి పెట్టుకునివున్న పొడుగాటి కవరుతో పాటు బయటకు నడిచాను.

అరగంటలో చేరుకున్నాను బస్ డిపోకి. రిజర్వేషన్ కౌంటర్ ముందు చిన్న క్యూ వుంది. ఇద్దరు ముగ్గురున్నారు. చివరతని వెనక నిలబడ్డాను క్యూలో.

"బెంగుళూరా?" అడిగాడు నా ముందతను నన్ను పలకరింపుగా.

తల వూపి నా కాగితాలు బయటకి తీశాను. పోస్టు చేయబోయే ముందు మళ్ళీ ఓ సారి రాసిన కథను చదవటం మంచిది తప్పులు దిద్దేందుకు చదువుతాను. మొదటినుంచి చివరిదాకా చదివి, రెండు మూడు తప్పులు దిద్దాను అక్కడక్కడా.

మధ్యమధ్యలో నా ముందతను నన్నే గమనించడం చూశాను నా వంతు రాగానే పని పూర్తి చేసుకుని బయటపడ్డాను. దగ్గరలో వున్న ఓ ఇరానీ రెస్టారెంట్‌కి వెళ్ళాను.

కవరు టేబిల్ మీద పెట్టి కూర్చున్నాను. ఇందాక నా ముందు బస్ డిపోలో క్యూలో నిల్చు నున్నతను వచ్చి నాఎదురుగా ఖాళీగావున్న కుర్చీలోకూర్చుని నా వంక చూసి నవ్వాడు, ప్రతిగా నవ్వాను నేను, అతనెవరో తెలీకపోయినా.

"రిజర్వేషన్ అయిందా ?" అడిగాడు.

తల వూపాను నేను.

"బెంగుళూరు వెళుతున్నారా ?"

"లేదు. నా స్నేహితుడు వెళుతున్నాడు. చండీఘర్ నుండి వస్తున్నాడు రేపు."

"ఇందాక మీరు ఏవో కాగితాలు చదువుతున్నారు?"

"అవును"

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు అతను.

"మీరు కథలు రాస్తారా?'

తల వూపాను చిన్నగా నవ్వి.

"మీ పేరు ?"

చెప్పాను.

అతని మొహంలో వూహించని మార్పు వచ్చింది. సంతోషం, ఆశ్చర్యం, వుత్సాహం తొంగి చూస్తున్నాయి. ముందుకి వంగి అన్నాడు.

"నాకు కథలు రాసేవాళ్ళతో పరిచయం లేదు. కాని వాళ్ళంటే అసూయ ఎందుకో తెలుసా ? నేను కూడా వాళ్ళలాగా రాయలేకపోతున్నానని".

"మీరు రాస్తూంటారా ?" అడిగాను.

"అప్పుడప్పుడు కొన్ని చిన్న పత్రికల్లో జోక్స్ పడ్డాయి. పెద్ద పత్రికలనుండి తిరిగి వస్తూంటాయి కథలు" అన్నాడు నవ్వి.

అతనివంక చూశాను పరిశీలనా దృష్టితో. ముఫ్పై అయిదేళ్ళుంటాయి. చామనచాయ రెండు చెవులకీ పైన బంగారు పోగులు. పొడవయినముక్కు, నుదుటకాలినమచ్చ.

"మీరెలా రాస్తారండి కథలు ?" అడిగాడు.

"చేత్తో."

నా ఎప్పటి రెడీమేడ్ సమాధానం చెప్పాను చిరునవ్వుతో.

"ఐ మీన్ ... ఎలా రాయగలుగుతారు? ప్లాట్, మొదలు. చివర, మధ్యలో సంభాషణ మొదలయినవి ఎలా తడ్తాయి మీకు."

"ముందగే స్కెచ్‌లాగా రాసుకుంటాను"

అతను చటుక్కున మా మధ్యవున్న టేబుల్ మీద కవరు అందుకుని, దాన్లోంచి కాగితాలు బయటికి తీశాడు.

* * *

"కొత్త కథ రాసారా ?" అడిగాడు.

"అవును."

"చదవచ్చా?"

తెల్లకాగితాల మడతలు విప్పాడు. ఆతని స్వతంత్రం నన్ను ఇబ్బంది పెట్టింది. కాగితాలు చేతిలోంచి తీసేసుకుని అన్నాను అతనితో:

"ప్రచురింపబడితేకాని నా కథలు ఇతరులు చదవటం నా కిష్టముండదు. స్నేహితులు, బంధువులు అడిగినాకూడా చూపించను."

"మంచిపద్ధతి" నవ్వాడు.

సర్వర్ రాగానే అతనే రెండు టీలు చెప్పాడు పట్టుకురమ్మని హిందీలో.

"నాపేరు గోవర్ధనరావు. చాలా కథలు రాసాను. ప్రచురింపబడ్డ అనేక ఇతర కథలకన్నా అవిచాలా మెరుగు. అయినా తిరిగి వచ్చేసాయి. ఏం చెయ్యాలి?" అన్నాడు కొంచెం నిస్పృహగా.

"మీరు వ్రాసినవి ఆపత్రికలవాళ్ళకి నచ్చకపోవచ్చు. మిగతావాటికి పంపిచూడండి."

సలహా ఇచ్చాను.

"కథ ఎలా రాయాలి?

మళ్ళీ అదేసమాధానం వచ్చింది అలవాటుగా.

"చేత్తో."

అతని మొహంలోని అసంతృప్తిని కనిపెట్టి అన్నాను:

"కథలోని సంఘటనలు అమర్చేవిధానం ముఖ్యం. అంటే కథని ప్రజెంట్ చేసేపద్ధతి. చదువుతూంటే తేలికగా

అర్థమయ్యే విధానంగా వుండాలి సంఘటనలు. గజిబిజిగా కాకుండా, తర్వాత కుతూహలం, వుత్సుకత కలిగించేలా ఏర్పాటు చేయాలి సంఘటనలని."

"కుతూహలం, వుత్సుకత అంటే సస్పెన్సు కదా?"

"అవును. వీలయినంత వరకు ఇంగ్లీషు పదాలు రాయకూడదు. తప్పనిసరి అయితే తప్ప. చదివేవాళ్ళలో అందరికీ ఇంగ్లీష్ రాదు."

శ్రద్ధగా వింటున్నాడు అతను.

"బాయ్ మీట్స్ గరల్ వదిలిపెట్టి, సెంటిమెంటల్ కథావస్తువు తీసుకుంటే, ప్రచురింపబడడానికి ఆస్కారం ఎక్కువ వుంది. అయినా ఇప్పుడు అవికూడా ఎక్కువయ్యాయి."

"మీరు ఇందాక కథ ప్రజంటేషన్ అన్నారు. అంటే వివరంగా చెప్పగలరా?"

అతన్ని చూస్తే నవ్వొచ్చింది. ముందు బెంచీలో కూర్చునే ఉత్తమవిద్యార్థి ఇష్టమయిన పాఠం వింటే ఎలా వుంటాడో అలావున్నాడు గోవర్ధనరావు.

"పాఠకులు ఊహించని ముగింపు ఇవ్వాలి. చిన్నప్పుడు నే చదివిన కథొకటి ఉదాహరణ చెప్తాను. ఓ మైదానంలో నడుస్తున్న ఒకతను మరొకతనితో అన్నాడు 'దెయ్యాలంటే నీకు నమ్మకం వుందా?' అని. 'ఉంది' సమాధానం చెప్పాడు అతను. 'మీకు వుందా?' అడిగాడు.

'లేదు' చెప్పాడు మొదట ప్రశ్న వేసినతను. 'మీకూడా వుండాకే' అన్నాడు రెండో అతను ఆశ్చర్యం. మొదట అడిగినతను తన ప్రశ్నకే నవ్వుకున్నాను ప్రశ్నన లేకపోవడం గమనించి చుట్టూ చూసాను ఆ విశాలమయిన మైదానం మొత్తంలో ఎక్కడా లేడు అతను మాయమయ్యాడు."

"అంటే ఆ రెండో అతను మాయమా?"

"అంతేగా మరి. పాఠకుల ఊహాకి వదిలేశాడు రచయిత."

"మీకథలు తిరిగివచ్చాయా?" అడిగాడు కాస్సేపాగి.

"మొదటి రెండుకథలూ పంపినవి ప్రచురించారు. తిరిగి రాలేదు."

"అదృష్టవంతులు. మీరు రాసినవి ఏవీ వెనక్కి రావు."

"మీ ఊహామాత్రమే అది నిజంకాదు. నేను రాసిన వి అయిదారు కథలలోనో ఒకటి ప్రచురిస్తారు. మిగతావి తిరిగివస్తాయి"

"మీవికూడా! మీ కథలు పత్రికల్లో నే చదివానే?"

"తిరిగివస్తాయి. నేనురాసిన కథలన్నీ బాగుండాలని లేదుగా: తిరిగి వస్తుంటాయి నావే కాదు. ఎవరివయినా. రచయిత కాదు. కథ బాగుండటం ముఖ్యం.

సర్వర్ టీ తీసుకువచ్చాడు. కద్దరం టీ తాగేదాకా మౌనంగా వుండిపోయాము.

"కథలకి బొమ్మ మీరే వేస్తారా?" మళ్ళీ అడిగాడు.

"లేదు: వేరే చిత్రకారులు వేస్తారు: కథలోని బలమయిన సన్నివేశం ఎంచుకుని,"

"ఇది దేనికి పంపుతున్నారు?"

చేత్తో టేబిల్ మీద వున్న కవరునితడుతూ అడిగాడు గోవర్ధనరావు.

"దీపావళి కథల పోటీకి."

"పేరు?"

"పడుతుందిగా. చూద్దురుగాని" నవ్వాను.

"తప్పకుండా పడుతుందా? మీవే తిరిగివస్తాయంటున్నారు?"

"ఇదిమాత్రం తప్పకుండా ప్రచురింపబడుతుంది. దీపావళి కథల పోటీకోసమే ఈ కథను ఇన్నాళ్ళూ పంపకుండా ఆపాను. పాత్ర, థీమ్, కథావిధానంలాంటివి బాగున్నాయి. కనీసం మూడో బహుమతి రాకపోయినా, సాధారణంగా నయినా ప్రచురింపబడుతుంది.'

బలవంతంగా తనే ఇచ్చాడు డబ్బు సర్వర్ కి గోవర్ధనరావు. నన్ను ఇవ్వనివ్వలేదు.

"మీరు నా కథలు చదువుతూంటారుగా. ఎప్పుడయినా మీ విమర్శ రాయండి నాకు." అన్నాను లేచి నిలబడి.

"మీ కథలన్నీ బాగానే వుంటూన్నాయి."

గోవర్ధనరావుకూడా లేచాడు.

"కథ బాగున్నా, అక్కడక్కడా పొరపాట్లు దొర్లుతూంటాయి. ఉదాహరణకి ఓ కథలో గెజిటెడ్ ఆఫీసర్ ఎర్రరంగు సిరా కలం ఉపయోగించినట్లు రాసాను. వాళ్ళు ఆకుపచ్చ ఇంకుమాత్రమే వాడుతారుట, ఓ స్నేహితుడు చెప్పాడు తర్వాత."

"తప్పకుండా తెలియజేస్తాను. గుడ్ లక్ అండి."

ఇరానీ రెస్టారెంట్ ఎదురుగావున్న కిళ్ళీకొట్టు వాడిని అడిగాను పోస్ట్ డబ్బా ఎక్కడయినా వుందా అని. పక్కనే వుంది. చూపించాడు చేత్తో "బాజూ హైసాబ్" అని.

డబ్బామీద రాసివుంది సాయంత్రం అయిదునిముషాలు తక్కువ ఆరుకి ఉత్తరాలు తీయబడతాయని సూచిస్తూ. ఇంకా పదినిముషాలదాకా వుంది తీయడానికి.

మరోసారి కథని చదివి, కవరులో పెట్టి, అతికించి కవరు పోస్ట్ డబ్బాలో పడేసాను.

రెండడుగులు వేసాక కనపడ్డాడు గోవర్ధనరావు మళ్ళీ.

"థాంక్స్ సర్, ఇందాక చాలా వివరాలు చెప్పారు."

"యు ఆర్ వెల్‌కం."

లోకల్ బస్ స్టాప్ వైపు నడిచాను.

* * *

నా గదిలో కేలండర్‌లో ఓ తారీఖు ఎర్రరంగు పెన్సిల్‌తో గుర్తుపెట్టుకున్నాను ఆ తారీకు లోపలే తెలిసిపోవాలి నా కథకి బహుమతి లభించేటట్లయితే.

ఆ తారీకు దాటి వారంరోజులయిపోయాక, నా కథకి బహుమతి రాలేదని వూహించాను. మరో కథకు వెళ్ళివుండవచ్చు. నాది బహుశ మామూలు ప్రచురణకి స్వీకరించి వుంటారని అనుకున్నాను.

దీపావళి ప్రత్యేకసంచిక విడుదలయ్యే రోజు దగ్గర పడుతున్నకొద్దీ నాలో ఆసక్తి అధికం అవుతోంది.

ఎవరి కథకి బహుమతి వెళ్ళివుండవచ్చా! నా కథ కన్నా బాగుందా! ఎంత బాగుండి వుంటుందో ఆ కథ.

ఎదురు చూస్తున్న రోజు రానేవచ్చింది.

ఆరోజు శెలవరోజు కాబట్టి బద్ధకంగా పడుకున్నాను గదిలోనే లేవకుండా. మధ్యాహ్నం ఒంటిగంటకి మా ఎదురింటాయన తీసుకువచ్చి ఇచ్చాడు పత్రికని

ఆత్రంగా తిరగేసాను. మొదటి, రెండు, మూడు బహుమతులు ఎవరికి వచ్చాయా అని. నా కథకి రాలేదు.

మొదటి బహుమతిపొందిన కథ పేరు. నా కథ పేరు ఒకటే. అప్పుడే అనుకున్నాను. నా కథకన్నా అది బాగుండచ్చు ఒకే పేరుతోగల రెండు కథలకి బహుమతి ఇవ్వటం ఇష్టంలేక మామూలుగా ప్రచురించవచ్చు నా కథని.

మొదటి బహుమతి పొందిన కథకి వచ్చాను. ఓసారి ఎక్కువ పేజీలుగల ఆ ప్రత్యేక సంచికని తిరగేసి.

కథ మొదలుపెట్టి అయిదారు వాక్యాలు చదవగానే నా గుండె ఝల్లుమంది. గబగబా మొదటి మూడు పేరాలు చదివాను.

నా రక్తనాళాల్లో రక్తం ఆగిపోయిందో, లేక ఇంకా వేగంగా ప్రవహిస్తోందో తెలియలేదు నాకు.

ఎందుకంటే అది నా కథ!
నేను రాసిన కథే అది!

అక్కడక్కడా చదువుతూ చివరికి వచ్చాను. పాత్రల పేర్లు, శైలి, మొదలు ముగింపు అంతా అది నా కథే.

పొరపాటు జరిగివుంటుంది ఎక్కడో. నా కథకే బహుమతి వస్తే, పొరపాటున మరొకరి పేరు ప్రచురించారు, ఆ కథారచయితగా.

సంభవమా? ప్రథమబహుమతి గ్రహీత ఫోటో కూడా ప్రచురించారు?

నా ఖంగారు చూసి అడిగాడు ఎదురింటాయన ఏం జరిగిందని. ఆవేశంగా చెప్పాను జరిగింది. నమ్మలేదు అతను పూర్తిగా.

కూర్చోలేకపోయాను కుర్చీలో. అటూ ఇటూ తిరిగాను గదిలోనే కొంతసేపు. లేచి - ఎలా జరిగివుంటుంది ఈ పొరపాటు.

చటుక్కున పత్రిక తెరచి మొదటిబహుమతి పొంది నతని ఫొటోని చూసాను పరిశీలనగా.

గుండె ఆగి ఆగి కొట్టుకోసాగింది గుర్తుపట్టాను వాడిని-మోహం.

అవే చెవ్వుల పోగులు. అదే ముక్కు. అదే మొహం నుదుటిమీద మచ్చ. గోవర్ధనరావు!

ఉత్తరాలు తీసే పోస్టల్ వుద్యోగికి ఎంత లంచం ఇచ్చి వుంటాడు?

***